ఆంధ్రజ్యోతి

andhrajyothy.com

శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 27.8 : కనిష్ఠం 25.7

నిర్మల్ జిల్లా వార్తలు

8

శనివారం 24 మే 2025





మత్తులో యువత

- హెచ్ 1 డ్రగ్స్ అమ్మకాలపై నియంత్రణ లోపం
- నిఘా, తనిఖీలు లేక ఇష్టారాజ్యం
- విచ్చలవిడి అమ్మకాలతో సులభంగా లభ్యం
- మత్తుకు బానిసలైన యువతకు ప్రిస్క్రిప్షన్ లేకుండానే అందుబాటులోకి..
- జిల్లాలో పక్కదారి పడుతున్న మెడికల్ వ్యాపారం

నిర్మల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : మత్తుకు బానిసలుగా మారుతున్న యువతను లక్ష్యంగా చేసుకుని కొంతమంది ప్రైవేట్ మెడికల్ సిబ్బంది వారికి మత్తు ఇంజక్షన్‌లు, టాబ్లెట్లు, సిరప్‌లను అంటగడుతూ వారిని బానిసలుగా మారుస్తున్నారు. జిల్లా కేంద్రంలో గత మూడు రోజుల క్రితం కొంత మంది ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్స్ ఒక ముఠాగా ఏర్పడి అమాయక యువకులకు మత్తు ఇంజక్షన్లు ఇస్తూ పోలీసులకు పట్టుబడ్డ సంగతి తెలిసిందే. దీంతో పాటు కొంతకాలం నుంచి జిల్లా వ్యాప్తంగా చాలా మంది యువకులు గంజాయికి కూడా పెద్ద ఎత్తున అలవాటు పడి బానిసలుగా మారిపోతున్నారు. పోలీసులు ఇప్పటికే చాలా మంది గంజాయిని అమ్ము తున్న వారిని పట్టుకుని అరెస్ట్ చేసినప్పటికీ పరిస్థితి తీవ్రత మాత్రం తగ్గకపోవడం ఆందోళన రేకెత్తిస్తుంది. కాగా మత్తు ఇంజక్షన్లు, సిరప్‌లు, టాబ్లెట్లు ఇక్కడి ప్రైవేట్ మెడికల్ షాప్‌లలో నిబంధనలను పక్కనపెట్టి అమ్ముతుండడం సమస్య తీవ్రతకు కారణమవుతోంది.

జోరుగా షెడ్యూల్ హెచ్ 1 మత్తు మందుల విక్రయాలు



మిడజోలం ఇంజక్షన్లు స్వాధీనం చేసుకున్న తర్వాత మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ డాక్టర్ జానకీషర్మిల (ఫైల్)

గత రెండేళ్ల క్రితం జిల్లాలోని ఆరు మెడికల్‌షాప్‌లపై దాడులు జరిపిన టాస్క్‌ఫోర్స్ బృందాలు ఈ దుకాణాల్లో నిబంధనలకు విరుద్ధంగా షెడ్యూల్ హెచ్ 1 మత్తు మందులను అమ్ముతున్నట్లు నిర్ధారించారు. షెడ్యూ ల్ హెచ్ 1బి ప్రకారం మొత్తం 46 రకాల మందులను అమ్మేటప్పుడు అనేక నిబంధనలను పాటించాల్సి ఉంది. ముఖ్యంగా క్వాలిఫైడ్ డాక్టర్ రాసిచ్చిన ప్రిస్క్రిప్షన్ ఉంటేనే ఈ మందులను విక్రయించాలి. అలాగే హెచ్ 1 రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. దీంతో పాటు బిల్లు ను సైతం తప్పనిసరిగా కొనుగోలు దారుడికి ఇవ్వాలి. అయితే జిల్లాలోని అనేక మెడికల్ షాప్‌లలో ఈ నిబంధనలను యాజమాన్యాలు తుంగలో తొక్కుతున్నాయన్న ఫిర్యాదులున్నాయి. సంబంధిత ఆఫీసర్లు మత్తు మందుల అమ్మకాలపై సీరియస్‌గా చర్యలు తీసుకోకపోతుండడం మెడికల్ వ్యాపారులకు వరంగా మారుతోంది. అయితే ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో ప్రైవేట్ మెడికల్ షాప్‌లు రూల్స్‌ను పక్కనపెట్టి ఇష్టానుసారంగా మత్తు మందులను, మరికొన్ని దుకాణాలలో నిషేధిత మందులను సైతం అమ్ముతున్నారన్న ఆరోపణలున్నాయి. మత్తు ఫార్ములాతో కూడిన టాబ్లెట్స్, సిరప్‌లను అడ్డగోలుగా అమ్ముతూ మెడికల్‌షాప్‌ల యాజమాన్యాలు లక్షల రూపాయలను ఆర్జిస్తున్నాయన్న విమర్శలున్నాయి. జిల్లా కేంద్రంతో పాటు భైంసా, ఖానాపూర్ పట్టణాల్లోనే కాకుండా మండల కేంద్రాల్లోని కొన్ని మెడికల్ షాప్‌లు ఇలా నిబంధనలకు విరుద్ధంగా షెడ్యూల్ హెచ్ 1 టాబ్లెట్లు, సిరప్‌లను అమ్ముతున్నాయన్న ఫిర్యాదులున్నాయి. డ్రగ్స్ కంట్రోల్ అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేయకపోతుండటం మెడికల్ షాప్ యాజమాన్యాలకు వరంగా మారుతోంది.

ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందుల విక్రయాలు

సరైన తనిఖీలు లేని కారణంగా చాలా మెడికల్ షాప్‌లలో ఎలాంటి ప్రిస్క్రిప్షన్ లేకుండానే మందులను విక్రయిస్తున్నారని అలాగే ఏ ఒక్క షాప్‌లో కూడా ఫార్మసిస్ట్ ఉన్న దాఖలాలు లేవంటున్నారు. ప్రతి మెడికల్ షాప్‌లో తప్పనిసరిగా ఓ ఫార్మసిస్ట్ ఉండాలని అలాగే మందులు కొనుగోలు చేసిన వారికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని బిల్లుపై బ్యాచ్ నంబర్, తయారీ తేదీ, ఎక్స్‌పైరీ డేట్ తప్పనిసరిగా ఉండాలన్న నిబంధన ఉంది. చాలా మెడికల్ షాప్‌లలో కొనుగోలు చేసిన మందులకు సంబంధించిన బిల్లులు ఇవ్వడం లేదని పేర్కొంటున్నారు. గతంలో హెచ్ 1 మందులను అమ్మిన ఆరు దుకాణాలను అధికారులు సీజ్ చేశారు. అయినప్పటికీ మందుల దుకాణాలు యాజమాన్యాలలో మార్పు మాత్రం కనిపించడం లేదంటున్నారు.

మెడికల్ షాప్‌ల ఇష్టారాజ్యం

జిల్లాలోని అనేక మెడికల్ షాప్‌లు ఇష్టారాజ్యంగా మందులను అమ్ముతున్నట్లు ఫిర్యాదులున్నాయి. డ్రగ్స్ కంట్రోల్ శాఖ అధికారులు నిరంతరం తనిఖీలు చేయకపోతుండటం యాజమాన్యాలకు కలిసొస్తుందంటున్నారు. సరైన నిఘా, తనిఖీలు లేకపోవడంతో మెడికల్ షాప్‌లు ఇష్టారాజ్యంగా జనరిక్ మందులను సైతం అంటగడుతున్నాయన్న విమర్శలున్నాయి. మందులు కొనుగోలు చేసిన వారికి బిల్లులు ఇవ్వకపోవడం మందుల షాప్‌లలో ఫార్మసిస్ట్‌ను నియమించకపోవడం, అన్ క్వాలిఫైడ్ సిబ్బందితో మందుల విక్రయాలు కొనసాగించడం, మత్తును కలిగించే టాబ్లెట్లు, సిరప్‌లను నిబంధనలకు విరుద్ధంగా అమ్ముతున్నారన్న విమర్శలున్నాయి.

ఆర్ఎంపీలతో మిలాఖత్

పల్లె ప్రాంతాల్లోని మెడికల్ షాప్‌లు అక్కడి ఆర్ఎంపీలు, ప్రైవేట్ మెడికల్ సిబ్బందితో మిలాఖత్ అవుతున్నారన్న ఆరోపణలున్నాయి. ఒక్కో ప్రిస్క్రిప్షన్‌పై మొత్తం కొనుగోళ్లను బట్టి ఆర్ఎంపీలకు కమీషన్‌లు చెల్లిస్తుంటారని పేర్కొంటున్నారు. ఎమ్మార్పీ ఎక్కువగా ముద్రించి ఉన్న మందులను రోగులకు అంటగడుతున్నారన్న ఆరోపణలున్నాయి. అలాగే ఆర్ఎంపీలు ఎక్కువ పర్సెంటేజ్ వచ్చే మందులను రోగులకు అంటగడుతున్నారంటున్నారు. పల్లెల్లో మెడికల్ వ్యాపారంపై ఎలాంటి తనిఖీలు లేకపోవడంతో ఆర్ఎంపీలు, అక్కడి మెడికల్ వ్యాపారుల ఇష్టారాజ్యం కొనసాగుతోందన్న విమర్శలున్నాయి.



క్యూలైన్లలో భక్తుల రద్దీ
(అమ్మవారి సన్నిధిలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఆలయ పూజారి)

ఏకాదశి సందర్భంగా బాసరలో భక్తుల సందడి

బాసర, మే 23 (ఆంధ్రజ్యోతి) : చదువుతల్లి బాసర సరస్వతీదేవి నిలయం శుక్రవారం భక్తుల సందడి నెలకొంది. అక్షర శ్రీకార పూజలకు అనువైన మంచి ముహూర్తం గల ఏకాదశి శుభదినం కావడంతో భక్తుల తాకిడి పెరిగింది. తెలుగు రాష్ట్రాలతో పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పవిత్ర గోదావరినదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకున్నారు. రెండు అక్షర శ్రీకార మండపాలు పిల్లలకు పూజలు జరిపించే భక్తులో దినమంతా కిటకిటలాడాయి. భారీగా అక్షర శ్రీకార పూజలు నమోదయ్యాయి. రూ.1000 టికెట్ గల మండపంలో 315 మంది,రూ 150 టికెట్ గల మండపంలో 383 మంది చిన్నారులకు అక్షర శ్రీకార పూజలు జరిగాయి. అమ్మవారి దర్శనం, పూజల కోసం భక్తులు దాదాపు రెండు గంటలు వేచి ఉండాల్సి వచ్చింది.

కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ హుండీ లెక్కింపు

దిలావర్‌పూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని శ్రీ కాల్వ లక్ష్మీ నరసింహస్వామి దేవస్థానం హుండీని శుక్రవారం తెరిచి లెక్కించారు. 11 రోజుల పాటు నిర్వహించిన నరసింహస్వామి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని రూ. 3,77,446ల నగదుతో పాటు మిశ్రమ బంగారం, వెండి లభించినట్లు దేవస్థానం ఈవో భూమయ్య తెలిపారు. హుండీ లెక్కింపులో దేవస్థానం చైర్మన్ మహేందర్, పాలకవర్గం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.



కాల్వ లక్ష్మీ నరసింహ స్వామి హుండీ లెక్కిస్తున్న పాలకవర్గం సభ్యులు, భక్తులు

ప్రగతి చక్ర అవార్డు గ్రహీతలకు సన్మానం



ప్రగతి చక్ర అవార్డు గ్రహీతలతో డీఎం

నిర్మల్ కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ డిపో ఆవరణలో శుక్రవారం ఆర్టీసీ ఉద్యోగుల అభినందన సభ ఏర్పాటు చేశారు. ప్రగతి చక్ర అవార్డు గ్రహీతలను డిపో మేనేజర్ పండరి శాలువాతో సన్మానించి అభినందించారు. 20 మందికి ప్రశంసా పత్రాలు అందజేశారు. జనవరి, ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్ నెలలో ఆదాయం తెచ్చిన కండక్టర్లు, ఇంధనం పొదుపు చేసిన డ్రైవర్లకు ప్రగతి చక్ర అవార్డులు లభించాయి. వీరిని మిగతా ఉద్యోగులు ఆదర్శంగా తీసుకోవాలని డీఎం కోరారు. డిపోను ఆదాయంలో అభివృద్ధి చేసేందుకు కృషి చేయాలన్నారు.

జిల్లా కేంద్రంలో బీజేపీ తిరంగా ర్యాలీ



జిల్లా కేంద్రంలోజరిగిన తిరంగా ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్ అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తా నుంచి ఓల్డ్ బస్టాండ్ అనంతరం న్యూ బస్టాండ్ వరకు నిర్వహించిన తిరంగా ర్యాలీ బీజేపీ అధ్వర్యంలో నిర్వహించారు. శుక్రవారం బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నేతృత్వంలో ఈ యాత్రలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఆపరేషన్ సింధూర్‌తో భారతసైన్యం చూపెట్టిన పరాక్రమాన్ని, ధైర్య సాహసాలను కీర్తిస్తూ... భారత సైనిక చర్య విజయానికి మద్దతుగా 'తిరంగాయాత్ర'లో నిర్మల్ వాసులు భారీగా తరలివచ్చారు. ఈ యాత్రలో స్థానికులు పెద్ద ఎత్తున పాల్గొని, కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షులు రితేష్‌రాథోడ్, పార్లమెంట్ కన్వీనర్ అయ్యన్నగారి భూమయ్య, జిల్లా మాజీ అధ్యక్షులు అంజుకుమార్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రావుల రాంనాథ్, జిల్లా ప్రధాన కార్యదర్శి మెడిసెమ్మె రాజు, సామ రాజేశ్వర్‌రెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు ఒడిసెల అర్జున్, నిర్మల్ పట్టణ అధ్యక్షులు ఆకుల కార్తీక్, సుంకరి సాయి, బీజేపీ సీనియర్ నాయకులు, నిర్మల్ ప్రజలు పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని పురవీధుల్లో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

ఆయిల్ పామ్ పంట కోత ప్రారంభించిన ఎమ్మెల్యే

దిలావర్‌పూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండంపల్లి గ్రామంలో సాగు చేస్తున్న ఆయిల్ పామ్ పంట కోతను నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. అంతకుముందు గ్రామంలోని బీరప్ప ఆలయాన్ని సందర్శించి బీరప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయిల్‌పామ్ పంట కోతను ప్రారంభించారు. అధిక దిగుబడులతో పాటు మార్కెట్‌లో డిమాండ్ ఉన్న పంటలను సాగు చేయాలని, తద్వారా ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. ఆయిల్ పామ్‌సాగులో గుండంపల్లి రైతులు ఆదర్శంగా ఉంటారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రావుల రాంనాథ్, డివిజనల్ ఉద్యాన శాఖ అధికారి మౌనిక, మాజీ జడ్పీటీసీ తక్కల రమణారెడ్డి, ముత్యంరెడ్డి, వినాయక్ రెడ్డి, సత్యం చంద్రకాంత్, వీరేష్, మండల అధ్యక్షులు నర్సారెడ్డి, జమాల్, అరవింద్, దినేష్, సాత్విక్‌తో పాటు మండల బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



గుండంపల్లిలో ఆయిల్ పామ్ పంటకోత ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఏలేటి

బాల్య వివాహాల నిర్మూలనకు పటిష్ట చర్యలు

- కలెక్టర్ అభిలాష అభినవ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అభిలాష అభినవ్

నిర్మల్ అర్బన్, మే 23 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో బాల్య వివాహాలను పూర్తిస్థాయిలో నియంత్రించాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో బాల్య వివాహాల నిర్మూలన, లింగ నిర్ధారణ పరీక్షల నిషేధం, మాదక ద్రవ్యాల నిర్మూలన, ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుల పరిష్కారం, ఇసుక అక్రమ రవాణా, మున్సిపల్ అంశాలు, రహదారి భద్రత, రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు పంపిణీ తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో బాల్య వివాహాల నియంత్రణకు చర్యలు చేపట్టాలని సూచించారు. గత రెండు సంవత్సరాలలో జిల్లాలో 29 బాల్య వివాహాలను అడ్డుకున్నట్లు చెప్పారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిసిన వెంటనే సంబంధిత అధికారులు, తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహించాలని, బాల్య వివాహాలను ప్రోత్సహించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలో స్కానింగ్ కేంద్రాలు, రోగ నిర్ధారణ పరీక్షల కేంద్రాలను తనిఖీలు చేస్తూ, కేంద్రాల్లో పనిచేస్తున్న వారి అర్హత పత్రాలను వైద్య శాఖ అధికారులు సరిచూడాలన్నారు. స్కానింగ్ కేంద్రాల్లో లింగ నిర్ధారణ పరీక్షలు జరిపే వారిపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆర్ఎంపీలు ప్రథమ చికిత్స తప్ప ఏ ఇతర చికిత్సలను చేయకుండా నియంత్రించాలని ఆదేశించారు. జిల్లాను మత్తు పదార్థాల రహిత జిల్లాగా మార్చేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. గంజాయి, నాటు సారా ఇతర నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను గుర్తించి, కేసులు నమోదు చేయాలన్నారు. విద్యాసంస్థల 400 మీటర్ల పరిధిలో గుట్కా, సిగరెట్ అమ్మకాలను నిషేధించాలన్నారు. యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండేలా విద్యా సంస్థల్లో అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని, అధిక ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించాలన్నారు. నకిలీ విత్తనాల అమ్మకానికి అడ్డుకట్ట వేయాలని వ్యవసాయ శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఎరువులు, విత్తనాల దుకాణాలు తనిఖీలు చేయాలన్నారు. విత్తనాల నాణ్యతపై అనుమానాలు ఉంటే నాణ్యత పరీక్షలకు పంపాలని, నిషేధించిన విత్తనాలు, పురుగుల మందుల వాడకంపై నిషేధం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. నకిలీ విత్తనాలు, పురుగుల మందులు విక్రయించిన దుకాణాదారులు, డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇసుక అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో నియంత్రించాలని, రెవెన్యూ, పోలీసు శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు చేపట్టినా, నిల్వ ఉంచిన, రవాణా చేసిన కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా చూడాలన్నారు. గృహ, ఇతర నిర్మాణాల అవసరాలకు రుసుములు చెల్లించి, రసీదులు పొందిన వారికి మాత్రమే ఇసుకను సరఫరా చేయాలన్నారు. అనంతరం ఎస్పీ జానకి షర్మిల మాట్లాడుతూ... బాల్య వివాహాలను నిరోధించడానికి సంక్షేమ, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేస్తాయన్నారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే పోలీసులు వారికి తెలియజేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలను నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటామని, త్వరలోనే ట్రాఫిక్, మహిళా పోలీస్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టామని, ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ మత్తు పదార్థాల వాడకాన్ని పూర్తిగా నిరోధిస్తామని తెలిపారు. గంజాయి, నిషేధిత మత్తు పదార్థాలు వినియోగించిన, రవాణా చేసిన టోల్ ఫ్రీ నెంబర్ 100 లేదా 8712659599 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. అనంతరం గంజాయి, నిషేధిత మత్తు పదార్థాల నిషేధంపై అధికారులతో కలిసి పోస్టర్లను కలెక్టర్, ఎస్పీలు ఆవిష్కరించారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, అదనపు ఎస్పీలు అవినాష్‌కుమార్, రాజేష్ మీనా, ఉపేందర్ రెడ్డి, సంక్షేమ, వైద్య ఆరోగ్య, పోలీసు, అబ్కారీ, ఆర్ అండ్ బీ, మున్సిపల్, రెవెన్యూ, వ్యవసాయ, విద్యా శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలి

పాఠశాల స్థాయిలోనే విద్యార్థులు ఉన్నత లక్ష్యాలు ఏర్పరచుకోవాలని కలెక్టర్ అభిలాష అభినవ్ సూచించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు విద్యాశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పురస్కారాల ప్రధానోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్, శాసనసభ్యులు జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... పదో తరగతి విద్యార్థులు కృషితో మంచి ఫలితాలు సాధించారని, వారి విజయంలో భాగస్వాములైన తల్లిదండ్రులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచినందుకు గర్వంగా ఉందని, భవిష్యత్తులో మరింత స్థాయిలో రాణించి, జిల్లాకు గౌరవం తీసుకురావాలని కలెక్టర్ పేర్కొన్నారు. కలెక్టర్, ఎమ్మెల్యేలు విద్యార్థులతో ముఖాముఖిగా మాట్లాడి వారి జీవిత లక్ష్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, పవార్ రామారావు పటేల్ మాట్లాడుతూ... పదవ తరగతిలో గొప్ప ఫలితాలు సాధించడం అభినందనీయమని, క్రమ శిక్షణతో విద్యను కొనసాగించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల నుంచి వచ్చిన విద్యార్థులు దేశ వ్యాప్తంగా ప్రతిభ చూపుతున్నారన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు కలెక్టర్, అదనపు కలెక్టర్, ప్రజా ప్రతినిధులు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలు అందజేసి సన్మానించారు. అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్, జిల్లా విద్యాధికారి పి. రామారావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సయ్యద్ అర్జుమన్ అలీ, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆనంద్‌రావు పటేల్, అధికారులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.



జ్యోతి వెలిగిస్తున్న జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



కలెక్టరేట్ ఆవరణలో బస్సు

కలెక్టర్ కార్యాలయానికి బస్సు సౌకర్యం

నిర్మల్ కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం గుండా మహాలక్ష్మి వాడ వరకు ఆర్టీసీ ప్రత్యేక బస్సు నడుపుతున్నట్లు డిపో మేనేజర్ పండరి తెలిపారు. పలు పనుల నిమిత్తం కార్యాలయానికి వెళ్లే ప్రజలకు సౌకర్యం కల్పించేందుకు బస్సు నడుపుతున్నామని శుక్రవారం తెలిపారు. ప్రతి రోజు ఉదయం 10:15 గంటలకు బస్టాండ్ నుండి బయలుదేరి కలెక్టరేట్ గుండా మహాలక్ష్మి వాడ వరకు వెళ్తుందన్నారు. తిరిగి సాయంత్రం 5 గంటలకు అక్కడి నుండి బస్టాండ్‌కు ఉంటుందన్నారు. రూ. 20 ఛార్జ్ నిర్ణయించామని, మహిళలకు మహాలక్ష్మి పథకం వర్తిస్తుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టౌన్ 1 సబ్ స్టేషన్ పరిధిలో నేడు (శనివారం) విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని విద్యుత్ అధికారి పత్రిక ప్రకటనలో తెలిపారు. నెలవారి మరమ్మతుల కారణంగా ఓల్డ్ బస్టాండ్, బుధవార్‌పేట్, నగరేశ్వర వాడ, బాగులవాడ, కలెక్టర్ క్యాంప్ కార్యాలయంలో, జోహార్‌నగర్, ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, ప్రియదర్శిని నగర్, ఏరియా ఆసుపత్రి, బర్కత్‌పురా, డాక్టర్ లైన్, కస్బా, కమల్ టాకీస్, రాయల్ బిల్డింగ్, చింతకుంటవాడ, గాంధీ చౌక్, ద్యాగవాడ, పింజారి గుట్ట, చిక్కడపల్లి మొదలైన ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు.

విద్యుత్ షాక్‌తో ఒకరి మృతి



విద్యుదాఘాతంతో మృతిచెందిన వృద్ధురాలు

నిర్మల్ రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఇంటి వద్ద ఉన్న ఇనుపచువ్వను పట్టుకోగా విద్యుదాఘాతానికి గురై వృద్ధురాలు మృతి చెందింది. ఎస్సై లింబాద్రి తెలిపిన వివరాల మేరకు ... మండలంలోని ముజ్గి గ్రామానికి చెందిన పెద్ద గొండ గంగవ్వ(72) శుక్రవారం మధ్యాహ్నం ఇంటికి ఉన్న ఇనుప రాడ్ పట్టుకోగా, కరెంట్ పోల్ నుండి వచ్చిన వైర్ ద్వారా విద్యుత్ షాక్ తగిలి సంఘటన స్థలంలోని మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బైండోవర్ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



నిందితులను ఖానాపూర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేస్తున్న ఎక్సైజ్ అధికారులు

ఖానాపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఒకసారి బైండోవర్ అయిన తర్వాత ఆ బైండోవర్‌ను ఉల్లంఘించి సదరు నేరాన్ని మళ్లీ చేస్తే కఠినచర్యలు తప్పవని తహసీల్దార్ సుజాత హెచ్చరించారు. శుక్రవారం నాటుసారాయి తయారీ, అమ్మకం, రవాణా లాంటి పలు కేసులో ఆరుగురు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులు ఖానాపూర్ తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ప్రస్తుతం ఆయా కేసుల్లో పట్టుబడిన ఆరుగురిని ఎక్సైజ్ అధికారులు తన ఎదుట బైండోవర్ చేశారని తెలిపారు. సదరు నిందితులు ఈ బైండోవర్‌ను ఉల్లంఘిస్తే రెండు లక్షల జరిమానా లేదా రెండేళ్ల జైలుశిక్ష విధిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్సై అభిషేకర్, సిబ్బంది వెంకటేష్, ఇర్ఫాన్, సాయన్న, కల్పన, తదితరులున్నారు.



డీలర్లతో మాట్లాడుతున్న తహసీల్దార్ విశ్వనాథ్

రేషన్ బియ్యాన్ని సకాలంలో అందించాలి : తహసీల్దార్

జైనథ్, మే 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆయా గ్రామాలలో గల వినియోగదారులకు సకాంలలో రేషన్ బియ్యాన్ని అందించాలని సాత్నాల మండల తహసీల్దార్ మడావి విశ్వనాథ్ అన్నారు. శుక్రవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో ఆయా గ్రామాల రేషన్ డీలర్లతో నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. రేషన్‌షాపులో రేషన్ సరుకును ఏ రోజుకు ఆ రోజు బోర్డుపై ఉండాలన్నారు. దీంతో పాటు స్టాక్ రికార్డులను ఏ రోజుకు ఆ రోజు రాసిపెట్టాలని సూచించారు. రేషన్ బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే పోలీసు పీడియాక్ట్ నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అంత్యక్రియల్లో పాల్గొన్న నాయకులు

ఉట్నూర్, మే 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని జైనూర్ ఐసీడీఎస్ కార్యాలయంలో గ్రేడ్-2 సూపర్‌వైజర్‌గా పని చేస్తున్న సుజాత గురువారం గుండెపోటుతో మృతి చెందడంతో శుక్రవారం ఉట్నూర్ మండలం గోదారిగూడలో నిర్వహించిన అంత్యక్రియలకు పలువురు నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ గోదారిగూడలోని వారి ఇంటికి వెళ్లి పార్థివ దేహానికి నివాళులర్పించి, అంత్యక్రియల్లో పాల్గొన్నారు. అంతకు ముందు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాడ సానుభూతి తెలిపారు. సుజాత ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. విధుల పట్ల నిక్కచ్చిగా ఉండే సుజాత గుండెపోటుతో మృతి చెందడం బాధకరమని పేర్కొన్నారు. సుగుణక్క వెంట మాజీ వైస్ ఎంపీపీ బాలాజిదావులే, మాజీ సర్పంచ్ జగదీశ్, నాయకులు సంతోష్‌జాదవ్, స్వామి, రవి తదితరులు పాల్గొన్నారు.

భారీ వర్షానికి కూలిన గోడ

నార్నూర్, మే 23(ఆంధ్రజ్యోతి): రెండు రోజుల నుంచి కురుస్తున్న అకాల భారీ వర్షాల కారణముగా మండల కేంద్రం అంబేద్కర్ విగ్రహం దగ్గర ఉన్న గిరిజనుడు రమేష్ ఆడె ఇంటి ప్రహరీ శుక్రవారం కూలిపోయింది. ఈ అంశంపై అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం అందించినా.. ఎవరూ స్పందించడం లేదని వాపోయారు. ప్రభుత్వ అధికారులు పని తీరు ఇలా ఉంటే.. పేద వారికి వీరి సహకారం ఎలా అందుతుందని ప్రశ్నించారు. ఇప్పటికైనా అధికారుల స్పందించకపోతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశాడు.



భారీ వర్షాల కారణంగా కుప్పకూలిన గోడ

తడిసిన ప్రతీ గింజను బేషరతుగా కొనాలి

● తడిసిన జొన్నలను పరిశీలించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్

నేరడిగొండ, మే 23(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాల కారణంగా కురిసిన వర్షాలకు నియోజకవర్గంలో అనేక మంది రైతులు జొన్నలు తడిసి ఇబ్బందులు పడుతున్న సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ కేంద్రంలో కొనుగోలు కేంద్రాన్ని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సందర్శించారు. ఈ సందర్భంగా జొన్నలను పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతులు ఆందోళన చెందొద్దని, తడిసిన ప్రతీ గింజను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. తప్పకుండా కొనే విధంగా బీఆర్ఎస్ పార్టీ తరపున ఒత్తిడి తీసుకొస్తామని తాను సైతం దగ్గరుండి కొనేలా చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు.

● హనుమాన్ ఆలయ నిర్మాణ పనులకు భూమిపూజ

గుడిహత్నూర్: మండలంలోని లింగాపూర్‌లో నూతన హనుమాన్ ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ ముఖ్య అతిథిగా హాజరై భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. తమ గ్రామంలో ఆలయ నిర్మాణానికి నిధులు మంజూరు చేసినందుకు గ్రామస్థులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఆలయాల నిర్మాణానికి పెద్దపీట వేసిందన్నారు. ఈ కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ నాయకులు గ్రామస్థులు పాల్గొన్నారు.

● సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నేరడిగొండ: మండలంలోని కుప్టి గ్రామానికి చెందిన దూల రాజవ్వకు మంజూరు అయిన రూ.14,500, అలాగే, ఇచ్చోడకు చెందిన సరిత ఏనుగుకు మంజూరైన రూ. మూడు లక్షలు, బజార్‌హత్నూర్ మండంలోని దేగామ గ్రామానికి చెందిన గాజుల సురేష్‌కు మంజూరు అయిన రూ. 33 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను శుక్రవారం నేరడిగొండ మండల కేంద్రంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అందజేశారు.



నేరడిగొండలో జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే



లింగాపూర్‌లో హనుమాన్ ఆలయ నిర్మాణ పనులను ప్రారంభిస్తూ..

బోథ్ బస్సుకు తృటిలో తప్పిన ప్రమాదం

● డ్రైవర్ సమయస్ఫూర్తితో నిలిచిన ఆర్టీసీ బస్సు

బోథ్, మే 23(ఆంధ్రజ్యోతి): బోథ్ మండల కేంద్రం నుంచి ఆదిలాబాద్‌కు ప్రయాణికులతో వెళ్లిన ఆర్టీసీ బస్సు అదిలాబాద్ సమీపంలోని వాగాపూర్ ఎక్స్‌రోడ్ వద్ద ప్రమాదానికి గురైంది. ఎక్స్ రోడ్ సమీపంలో ముందుగా వెళుతున్న కారును వెనుక నుంచి లారీ ఢీకొట్టడంతో ముందున్న బస్సుకు కారు ఢీ కొట్టింది. అంతేగాక బస్సును లారీ బలంగా ఢీకొనడంతో ప్రయాణికులతో ఉన్న బస్సు ముందుకు వేగంగా వెళ్లింది. ఒక దశలో డ్రైవర్ బస్సు వేగాన్ని తగ్గించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. డ్రైవర్ చాకచక్యంతో వేగంగా వెళ్లిన బస్సును అతికష్టం మీద నిలిపి వేశాడని బస్సులో ప్రయాణికులు తెలిపారు. అయితే సంఘటనా సమయంలో బస్సులోని ప్రయాణికులు తీవ్ర ఆందోళనకు గురయ్యారని, కొంతమంది భయంతో బస్సులో కేకలు వేయడంతో పాటు అటు ఇటు పరుగులు తీశారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మరోవైపు కారును ముందు వెనుక భాగం నుంచి వాహనాలు ఢీకొనడంతో కారు ధ్వంసం అయింది. కారులో ప్రయాణిస్తున్న వారు మాత్రం ఎలాంటి గాయాలు తగలకుండా బయటపడ్డారు. కారులోని బెలూన్స్ ఓపెన్ కావడంతో ప్రాణాపాయం తప్పిందని పలువురు పేర్కొన్నారు.

● బస్సు నిలువక పోతే..

ఆదిలాబాద్ వైపు వెళుతున్న బస్సును వెనుక నుంచి మరో వాహనం ఢీకొనడంతో బస్సు వేగం పెరిగిందని బస్సులోని ప్రయాణికులు తెలిపారు. అయితే డ్రైవర్ సమయ స్ఫూర్తితో వ్యవహరించి బస్సును అతి కష్టం మీద నిలిపారు. బస్సు స్పీడ్ తగ్గి ఆగకపోతే పక్కనే ఉన్న సబ్‌స్టేషన్‌పై పడేదని, దీంతో ఘోర ప్రమాదం జరిగి ఉండేదని బస్సులోని పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు. ఏది ఏమైనా బస్సు ప్రమాదం జరిగిన వెంటనే ప్రయాణికులు బస్సు దిగి రోడ్డుపై వచ్చి వణికి పోయారు.



● సంఘటనా స్థలంలో నుజ్జునుజ్జయిన కారు



● వెనుక నుంచి ఢీకొనడంతో ధ్వంసమైన బోథ్ బస్సు

ఘనంగా తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ జన్మదినం

ఆదిలాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి): ఆదిలాబాద్ తాజా మాజీ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ జన్మదినం ఘనంగా నిర్వహించారు. శుక్రవారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో కార్యకర్తలతో కలిసి వేడుకలను జరుపుకున్నారు. ఈ సందర్భంగా కేక్‌ను కట్ చేసి పలువురు బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు యూనిస్ అక్బాని, పండ్ల శ్రీనివాస్, వెంకటేశ్, కొండ గణేష్, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సహాయం

నార్నూర్, మే 23(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం ఇందిరా నగర్‌కు చెందిన పేద కుటుంబం బెలే దత్త కుమార్తె వివాహానికి సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.గజానంద్ నాయక్ శుక్రవారం రూ.5 వేల ఆర్థిక సహాయం అందించారు. ఆయన మాట్లాడుతూ పేదలకు ఎల్లప్పుడు సహాయానికి ముందుంటానని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

కనిపించని కదలిక!

(5వ పేజీ తరువాయి...)

అవుతున్నాయి. వెట్‌రన్ పూర్తి చేయడంతోనే కరెంట్ బిల్లులు కూడా కోట్ల రూపాయల్లో పెరిగి పోతుందని అధికారులు చెబుతున్నారు. వేల కోట్లు ఖర్చు చేసి నిర్మించిన పంప్‌హౌజ్ నిరుపయోగంగానే మారింది. అయితే ఎన్నికల కోసమే గత ప్రభుత్వం వెట్‌రన్‌ను పూర్తి చేసి చేతులు దులుపుకుందన్న ఆరోపణలు వస్తున్నాయి.

ఈ'సారీ'.. అంతే సంగతి!!

కోర్టా-చనకా బ్యారేజీ నిర్మాణ పనులు దాదాపుగా పూర్తయినా.. కాలువల నిర్మాణ పనులు ఇంకా అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. దీంతో ఈ సారి వానాకాలం సీజన్‌లోను ఆయకట్టుకు సాగునీటిని అందించడం కష్టమేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. కాలువల నిర్మాణ పనులు పూర్తయితే ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాల పరిధిలో సుమారుగా 50 వేల ఎకరాలకు పైగా ఆయకట్టుకు సాగునీరు అందనుంది. ఇంతటి ప్రాధాన్యత గల ప్రాజెక్టును ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుందన్న విమర్శలు వస్తున్నాయి. ప్రతియేటా వేల క్యూసెక్కుల నీరు వృధాగానే దిగువకు వెళ్లిపోతుంది. వరద నీటికి అడ్డుకట్ట వేసి జిల్లా ఆయకట్టుకు సాగునీటిని అందిస్తే బీడు భూములు సస్యశ్యామలంగా మారనున్నాయి. కనీసం రూ.300 కోట్ల నిధులను విడుదల చేస్తే భూసేకరణ పూర్తయ్యే అవకాశం ఉంటుంది. అసలే జిల్లాలో అంతంతమాత్రంగా నీటి వనరులు అందుబాటులో ఉన్నాయి. దీంతో రైతులు వర్షాధార పంటలనే సాగు చేస్తున్న రెండు పంటల సాగుకు అవకాశమే లేకుండా పోయింది.

నిధుల కటకట

కోర్టా-చనాకా బ్యారేజీ కాలువల నిర్మాణానికి నిధుల కొరత కనిపిస్తుంది. దీంతో ఆశించిన స్థాయిలో పనులు ముందుకు సాగడం లేదు. గత నాలుగైదేళ్లుగా బిల్లులు పెండింగ్‌లో ఉండడంతో పనులు చేయలేమంటూ సంబంధిత కాంట్రాక్టర్ చేతులెత్తేశాడు. ప్రధాన ఉప కాలువల పనులు పూర్తిగా నిలిచిపోయాయి. వేసవిలో పనులు చేసేందుకు అనువుగా ఉన్న నిధులు మంజూరుకాక పోవడంతో నిస్సాహయత స్థితి కనిపిస్తుంది. గత రెండేళ్ల క్రితమే కాలువల ద్వారా ఆయకట్టుకు సాగునీటిని అందిస్తామని చెప్పినా.. ఇంకా ఎక్కడి పనులు అక్కడే అన్నట్లుగా కనిపిస్తున్నాయి. పూర్తి స్థాయిలో కాలువల నిర్మాణపు పనులను చేపట్టేందుకు మరో రెండేళ్ల సమయం పట్టే అవకాశం ఉందంటున్నారు. బ్యారేజీ, పంప్‌హౌజ్ పూర్తయిన కాలువల నిర్మాణ పనులు పూర్తికాక పోవడంతోనే ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. సుమారుగా మరో 1500 ఎకరాల భూసేకరణకు నిధులు అవసరమని అధికారులు చెబుతున్నారు. ఇకనైనా ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారిస్తేనే కోర్టా చనకా ఆయకట్టుకు సాగునీరు అందనుంది.

విద్యుత్ తీగలు తగిలి గేదె మృతి

బోథ్, మే 23 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కౌటా(బి) గ్రామానికి చెందిన పడిగెల చిన్న భీముడు అనే రైతుకు చెందిన గేదె శుక్రవారం ఉదయం విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురై మృతి చెందింది. ఉదయం పూట మేతకు వెళ్లిన గేదె 11 కెవి విద్యుత్ తీగలు తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. అయితే, ఈదురుగాలులకు విద్యుత్తు తీగ తెగి పడటం వల్ల ఈ ప్రమాదం సంభవించిందని స్థానికులు అంటున్నారు. దీంతో రైతుకు 50 వేల రూపాయల మేర నష్టం సంభవించిందని వారు పేర్కొన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత

బోథ్, మే 23 (ఆంధ్రజ్యోతి): ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత ఉంటుందని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని రేండ్లపల్లి గ్రామంలో జరిగిన హనుమాన్ విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి దినచర్యలలో భాగంగా ఉరుకులు పరుగుల జీవితాన్ని గడపాల్సి వస్తుందన్నారు. దీంతో మానసిక ప్రశాంతత కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఇందులో మాజీ సర్పంచ్ సురేందర్ యాదవ్, ఆర్ఎస్ రైతు మండల అధ్యక్షుడు బొడ్డు శ్రీనివాస్, బోథ్ పట్టణ అధ్యక్షులు అల్లకొండ ప్రశాంత్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ గంగారం, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



మలేరియా వ్యాధిగ్రస్తుని ఇంటి పరిసరాల్లో ద్రావకంతో పిచికారి చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మలేరియా వ్యాధిగ్రస్తుని కుటుంబ సభ్యులకు రక్త పరీక్షలు

నిర్మల్ రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : మలేరియా వ్యాధిగ్రస్తుని కుటుంబ సభ్యులకు రక్తపరీక్షలు నిర్వహించినట్లు వైద్యసిబ్బంది తెలిపారు. పట్టణంలోని సన్‌షైన్ అపార్ట్‌మెంట్ నందు మలేరియా సోకిన వ్యాధిగ్రస్తుని ఇంటి లోపల, బయట పరిసరాలలో పైరిత్రం ద్రావకంతో పిచికారి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం. దేవదాస్, సానిటరీ జవాన్ బి. సంతోష్, వైద్య సిబ్బంది, ల్యాబ్ టెక్నీషియన్, వెంకటస్వామి, మలేరియా టెక్నికల్ సూపర్‌వైజర్ మహేందర్, ఆశ రాధ పాల్గొన్నారు.

'కేంద్ర పథకాలు సద్వినియోగం చేసుకోవాలి'

నిర్మల్ కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం అందించే పథకాలు రైతులు సద్వినియోగం చేసుకోవాలని బీజేఎల్పీ నేత, ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కోరారు. శుక్రవారం వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో ఆయిల్‌పామ్ గెలల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ్‌రెడ్డి, ఆత్మచైర్మన్ రాంరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్ల ఇంద్రకరణ్ రెడ్డి, రావుల రాంనాథ్, ముత్యం రెడ్డి, సాదం అరవింద్, జమాల్, సత్యం చంద్రకాంత్, జుట్టు దినేష్, వ్యవసాయ శాఖ అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల పరిశీలన వేగవంతం చేయాలి

కుంటాల, మే, 23 : (ఆంధ్రజ్యోతి) : మండలం భూ భారతి పథకంలో పైలట్ ప్రాజెక్టులో ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలని ఆర్డీవో కోమల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కుంటాల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్‌లు కమల్‌సింగ్, ఎజాజ్ అహ్మద్, ప్రవీణ్‌కుమార్, డీటీ నరేష్‌గౌడ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సేకరించిన దరఖాస్తుల పరిశీలన క్షేత్రస్థాయిలో నిర్వహించి సత్వరమే పరిష్కరించాలని సూచించారు. ప్రభుత్వం నూతనంగా భూ భారతి పథకాన్ని ప్రవేశపెట్టినందున ఈ పథకం యొక్క లక్ష్య సాధన కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని పేర్కొన్నారు.

'ఐకే రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్‌ను బలోపేతం చేస్తా'

నిర్మల్ కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : రాబోయే రోజుల్లో ఐకే రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి క్షేత్రస్థాయి నుండి కృషి చేస్తానని మాజీ డీసీఎంఎస్ చైర్మన్ ఐరా నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం మాజీ డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్‌రెడ్డితో కలిసి ఇంద్రకరణ్‌రెడ్డి వర్గీయులు విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇంద్రకరణ్‌రెడ్డి నేతృత్వంలో గతంలో సైతం కాంగ్రెస్ పార్టీ కోసం పని చేశామన్నారు. ఇంద్రకరణ్‌రెడ్డిని విమర్శించే స్థాయి బీఆర్ఎస్‌కు లేదన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయానికి ఇంద్రకరణ్‌రెడ్డితో కలిసి కృషి చేస్తామన్నారు. నాయకులు ముడుసు సత్యనారాయణ, రమణారెడ్డి, అనుముల భాస్కర్, పాకాల రాంచందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎడ్‌బిడ్‌లో భూ వివాదంపై విచారణ జరిపిన అధికారులు

ముథోల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎడ్‌బిడ్ గ్రామంలో శుక్రవారం భూవివాదంపై భైంసా ఆర్డీవో కోమల్‌రెడ్డి, అడిషనల్ ఎస్పీ అవినాష్‌కుమార్‌లు విచారణ జరిపారు. కొంత మంది తన భూమిని ఆక్రమించి ఇళ్లు నిర్మించుకున్నారని, మరికొందరు ప్లాట్‌లను ఆక్రమించుకున్నారని బాధితుడు కొందపురం సాయన్న ఏప్రిల్ 27న తెలంగాణ రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశారు.

కొనుగోలు కేంద్రాల్లో మొలకెత్తుతున్న ధాన్యం



కొనుగోలు కేంద్రంలోని మొలకెత్తిన ధాన్యం.. చూపుతున్న రైతులు

నిర్మల్ రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం మొలకెత్తుతున్నాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని కొట్ల(కే) గ్రామంలో బుధవారం పడిన వాన తీవ్ర నష్టం మిగిల్చింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందకుండా పాడవుతుండడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొనుగోలు కేంద్రాల్లో పోసిన వడ్లు అలాగే ఉండడంతో వాటిని కాపాడుకునేందుకు రైతులు ఆగమయ్యారు. వర్షాలకు వడ్లు తడిసి మొలకెత్తుతుండగా కన్నీరు పెడుతున్నారు. మండలం లోని చిట్యాల నుండి సిద్దుల కుంట గ్రామ రహదారిపై సుమారు ఐదు కిలోమీటర్ల మేర ఎటు చూసిన ఆరబెడుతన్న ధాన్యమే కనబడుతుంది. ప్రభుత్వం స్పందించిన మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

మొలకెత్తిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికందకుండా పాడవుతుందని, వర్షాలకు వడ్లు తడిసి మొలకెత్తుతున్నాయన్నారు. మొలకెత్తిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి తమను ఆదుకోవాలని రైతులు ఎం. సాయన్న, చాకిరి భీమన్న ప్రభుత్వాన్ని కోరారు.

తడిసిన ధాన్యాన్ని కోతలు లేకుండా కొనుగోలు చేయాలి

-దిలావర్‌పూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : తడిసిన ధాన్యాన్ని ఎలాంటి కోతలు లేకుండా కొనుగోలు చేయాలని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు. అకాల వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లిన నేపథ్యంలో ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని రైతులకు న్యాయం చేయాల్సిన అవసరముందన్నారు. కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యాన్ని త్వరితగతిన కొనుగోలు ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఎటువంటి కటింగ్ లేకుండా కొనుగోలు ప్రక్రియ చేపట్టాలన్నారు. తహసీల్దార్ ఎజాజ్ అహ్మద్ ఖాన్, పౌరసరఫరాల శాఖ అధికారులు, స్థానిక రైతులు, మండల నాయకులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రం పరిశీలించిన డీపీఎం

నర్సాపూర్(జి), మే 23 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని ఐకేపీ వరి కొనుగోలు కేంద్రాలను శుక్రవారం డీపీఎం సాయిప్రసాద్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... తూకం వేసిన బస్తాలను వెంటనే రైస్ మిల్లులకు పంపించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం సునంద, సిబ్బంది ముత్యం, అనిల్ పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీపీఎం సాయిప్రసాద్

వ్యాయామ విద్య అత్యంత ఆవశ్యకమైనది

● రాష్ట్ర రిసోర్స్ ఉపాధ్యాయుడు, పరిశీలకుడు డా. వెంకన్న

నిర్మల్ రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : వ్యాయామ విద్య కూడా అత్యంత ఆవశ్యమైందని రాష్ట్ర రిసోర్స్ ఉపాధ్యాయుడు రాష్ట్ర పరిశీలకుడు డా. వెంకన్న అన్నారు. పట్టణంలోని విజయ ఉన్నత పాఠశాలలో వ్యాయామ ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న ఐదు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని రాష్ట్ర రిసోర్స్ ఉపాధ్యాయుడు, రాష్ట్ర పరిశీలకుడు అయిన డా. వెంకన్న సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... అన్ని విషయాల మాదిరిగానే వ్యాయామ విద్య కూడా ముఖ్యమైందని, దానికి కూడా ఒక విషయంగా పరిగణించాల్సి ఉందని ఆయన తెలిపారు. వ్యాయామ విద్యపై కూడా ఒక ప్రత్యేక పుస్తకం రాబోతుందని, పాఠశాలలో ప్రత్యేక పీరియడ్ కేటాయించి, వ్యాయామ విద్యను విద్యార్థులకు అందించవలసి ఉందని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు కూడా ప్రస్తుతం ఉన్నటువంటి క్రీడలు, వాటి పూర్తి వివరాలను తెలుసుకొని ఉండాలన్నారు. వివిధ రకాల పోటీలు, వాటి నియమ, నిబంధనలు, కోర్టులు వేసే విధానం, కొలతలు, ఉపయోగించే క్రీడా పరికరాలు, వీటన్నింటి సమాచారంపై పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఈ సందర్భంగా డీఆర్పీలు, వ్యాయామ ఉపాధ్యాయులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ సమన్వయకర్త, కోర్సు బాధ్యులు ఎస్. ప్రవీణ్‌కుమార్, డీఆర్పీలు ఎం.శ్రీనివాస్, వి.భూమన్న, అన్నపూర్ణ, జమున, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



రాష్ట్ర పరిశీలకుడు వెంకన్నను సన్మానిస్తున్న దృశ్యం

రెవెన్యూ, అటవీశాఖల ఆధ్వర్యంలో ఉమ్మడి సర్వే నిర్వహించాలి

● ఆదివాసి గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభు

నిర్మల్ రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ, అటవీశాఖల ఆధ్వర్యంలో ఉమ్మడి సర్వే నిర్వహించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి తొడసం శంభుఅన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... గుమ్మెన, ఎంగ్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న నాలుగు గ్రామాల్లో సాగు భూములపై రెవెన్యూ, అటవీ శాఖల ఉమ్మడి సర్వే నిర్వహించాలని శనివారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం ఇచ్చినట్లు తెలిపారు. గుమ్మెన, ఎంగ్లాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న నాలుగు గ్రామాల ప్రజలు గత 50 సంవత్సరాలుగా రెవెన్యూ, పట్టా భూములు, ప్రభుత్వ పట్టాలు, లావుణి పట్టాలలో సాగు చేసుకుంటున్నారు. వీరందరూ బీసీ, ఆదివాసి సామాజిక వర్గాలకు చెందినవారని, కానీ ఇటీవల అటవీశాఖ అధికారులు ఈ భూములు అటవీ శాఖకు చెందినవని పేర్కొంటూ, రైతులు పంటలను పండించవద్దని హెచ్చరిస్తున్నారని తెలిపారు. గత ఐదు దశాబ్దాల్లో ఎప్పుడు అటవీ శాఖ ఈ భూములపై వివాదం తీసుకొచ్చిన సందర్భం లేదన్నారు. ఈ ధర్నాకు తెలంగాణ ఆదివాసి గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు పంద్రం ఆనంద్ రావు, గ్రామాల నాయకులుగా లింగన్న, బాబురావు, ఎల్లయ్య, పోశన్న, పిట్ల ఎల్లయ్య, సాయిరెడ్డి, ఉప్పు రామవ్వ, మక్కల చిన్నక్క, ఎంకవ్వ, లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



జిల్లా నుంచి పలు విభాగాల్లో ఎంపికైన క్రీడాకారులు

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలకు ఎంపికయిన క్రీడాకారులు

నిర్మల్ కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : మంచిర్యాలలో మే 24 నుంచి 26 వరకు జరుగనున్న రాష్ట్రస్థాయి సబ్ జూనియర్, బాల, బాలికల బాక్సింగ్ పోటీలకు నిర్మల్ జిల్లా నుంచి పలు విభాగాల్లో క్రీడాకారులు ఎంపికయ్యారు. బాలికల విభాగంలో అండర్- 17 కేటగిరీలో నిఖిత (44-46), అక్షిత (46-48), కీర్తన (48-50), అభినయ (52-54), శ్రావణి (58-60) ఎంపిక చేశారు. బాలుర విభాగంలో అండర్- 14 కేటగిరీలో దీక్షిత్ (40-42), కృషి రెడ్డి (42-44), శౌర్యన్‌రెడ్డి (48-50) అలాగే అండర్- 17లో అభిలాష్ (44-46) బరువులలో పాల్గొననున్నారని నిర్మల్ జిల్లా బాక్సింగ్ సెక్రటరీ, కోచ్ స్వామి తెలిపారు. జిల్లాను గర్వపెట్టేలా ఈ క్రీడాకారులు ప్రతిభ కనబర్చాలని ఆశాభావం వ్యక్తం చేశారు. అలాగే జిల్లా క్రీడాధికారి శ్రీకాంత్, ఎక్సైజ్ సూపరింటెండెంట్ అబ్దుల్ రజాక్, బాక్సింగ్ సంఘ అధ్యక్షుడు శ్రీధర్, కార్యవర్గ సభ్యులు వారిని అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

నేటి తిరంగా ర్యాలీకి దేశభక్తులంతా తరలిరండి

● బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

ఖానాపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల ఉగ్రమూకలపై భారత సైన్యం ఆపరేషన్ సింధూర్ పేరిట చేపట్టిన చర్యల విజయానికి ప్రతీకగా దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న తిరంగా ర్యాలీ ఖానాపూర్‌లో శనివారం నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ తిరంగా ర్యాలీకి పార్టీలకతీతంగా దేశభక్తులు, యువత తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. మధ్యాహ్నం 12 గంటలకు స్థానిక జంగల్ హనుమాన్ ఆలయం నుండి ర్యాలీని ప్రారంభించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ద్విచక్ర వాహనాలపై నిర్వహించే ఈ తిరంగా ర్యాలీ పట్టణ పురవీధుల మీదుగా ఎన్టీఆర్ చౌక్, వివేకానంద చౌక్, తెలంగాణ తల్లి చౌరస్తా, పాత బస్టాండ్, బస్టాండ్ ప్రాంతాల మీదుగా సాగుతుందన్నారు.

జూన్ మూడో తేదీ నుంచి పదవ తరగతి సప్లిమెంటరీ పరీక్షలు

నిర్మల్ రూరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : జూన్ మూడో తేదీ నుండి 13వ తేదీ వరకు పదవ తరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు శుక్రవారం పత్రిక ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ఉదయం 9:30 గంటల నుండి 12:30 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని సోమవార్‌పేట్ ప్రభుత్వ బాలిక ఉన్నంత పాఠశాలలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అంబలి పంపిణీ గొప్ప కార్యక్రమం

నిర్మల్ కల్చరల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి అతిథి గృహం వద్ద పాకాల రాంచందర్ ప్రజలకు ఉచితంగా అంబలి పంపిణీ చేయడం గొప్ప కార్యక్రమమని మజీ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. శుక్రవారం అంబలి పంపిణీ ముగింపు సందర్భంగా పాకాలను ఆయన పూలమాల శాలువాతో సత్కరించారు. నాయకులు పీవి రమణారెడ్డి, దశరథ్ రాజేశ్వర్, భూమేష్ పతాని, మేడారం ప్రదీప్, రాజు, శ్రీనివాస్, అనుముల భాస్కర్, పూదరి సాయికృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా రిసోర్స్ పర్సన్

కుంటాల, మే, 23 : (ఆంధ్రజ్యోతి) : కుంటాల మండలంలోని కల్లూరు గ్రామంలో కొనసాగుతున్న మండల స్థాయి ఉపాధ్యాయుల శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా రిసోర్స్ పర్సన్ మాదరి ఎల్లన్న సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులకు కోర్సు లక్ష్యాలను తెలియజేశారు. మౌళిక భాష, గణిత సామర్థ్యాలలో భాగంగా (ఎఫ్ఎల్ఎన్) పరిశీలించారు. తెలుగు, ఆంగ్లం, గణితం, పరిసరాల విజ్ఞానంలోని సామర్థ్యాలను సోపానాల ప్రకారం గుర్తించి బోధన చేయాలని సూచించారు.



హస్నాపూర్ సమీపంలోని పంట భూమిలో చెత్త కుప్పలు దగ్ధం చేస్తున్న దృశ్యం



చాందూరి ప్రాంతంలో ట్రాక్టర్‌తో భూమి దున్నుతున్న రైతు

వ్యవసాయ పనులు ప్రారంభించిన రైతులు

● వేసవి దుక్కులతో లాభం ●ఎరువులు, విత్తనాలు సిద్ధం చేస్తున్న వ్యాపారులు
● పెరుగుతున్న వడ్డీ వ్యాపారులు

ఉట్నూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): నైరుతి రుతు పవనాలు రాకముందే ఆకాల వర్షాలు కురుస్తుండడంతో రైతులు వ్యవసాయ పనులను ప్రారంభించారు. ఉట్నూర్ ఏజెన్సీలోని గాదిగూడ, నార్నూర్, ఇంద్రవెల్లి, ఉట్నూర్ మండలాల్లోని రైతులు ఖరీఫ్ పంటలు పండించడానికి సన్నద్ధం అవుతున్నారు. ఉట్నూర్ మండలంలోని నాగపూర్, ఎంకా, ఎందా, ఉమ్రి, హస్నాపూర్, షాంపూర్, లక్కేటిపేట, కామ్నైపేట్, సాలెవాడ, ఓల్వా డి, పులిమడుగు, ఆందోళి, నర్సాపూర్(బి); జమాల్‌తండా, సాకెర, గోండుసాకెర, దంతన్‌పల్లి, నర్సపూర్(జె), బీర్సాయిపేట, తేజపూర్, హీరాపూర్ తదితర ప్రాంతాలకు చెందిన రైతులు తమ వ్యవసాయ భూములను గంటలకు అనువుగా సిద్ధం చేస్తున్నారు. కొందరు రైతులు ఇప్పటికే పాత పంటలు తొలగించి కుప్పలు వేసి చెత్తను కాల్చి చేస్తున్నారు. వేసవి దుక్కులు చేపట్టడం ద్వారా పంటలకు చీడపీడల బెడద తప్పుతుందని వ్యవసాయ నిపుణులు చెప్పడంతో రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటిస్తున్నారు. మరికొందరు రైతుల భూములను చదువను చేయడంతో పాటు నాగళ్లతో దున్నుతుండగా మరికొందరు రైతులు ట్రాక్టర్లతో భూములను దున్నుతున్నారు.

విత్తనాలు ఎరువులు సిద్ధం చేస్తున్న వ్యాపారులు

మండలంలోని చిన్నచిన్న గ్రామాలలో సైతం విత్తనాల డీలర్లు విత్తనాలతో పాటు ఎరువులు, క్రిమి సంహారక మందులను అమ్మకానికి సిద్ధం చేస్తున్నారు. ఉట్నూర్ ఏజెన్సీలోని రైతులు అధికంగా పత్తి, సోయాబీన్ లాంటి వాణిజ్య పంటలను సాగు చేయడానికి ఆసక్తి చూపిస్తుండడంతో వ్యాపారులు రైతుల కోసం విత్తనాలు ఎరువులు తెప్పించి నిల్వలు చేస్తున్నారు.

పెరుగుతున్న వడ్డీ వ్యాపారులు..

గిరిజన ప్రాంతాల రైతులు అమాయకత్వంతో ఆర్థిక అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఏజెన్సీలోని గ్రామాలలో పత్తి వ్యాపారులు గిరిజన రైతులకు వడ్డీ భారం మోపుతూ ఖరీఫ్ పంట కాలానికి విత్తనాలు, ఎరువులు, క్రిమి సంహారక మందులు ఉద్దెర ఇచ్చి రైతుల ఇంటి వద్దకే విత్తనాలు, ఎరువులు పంపించి పంట చేతికి అందగానే అసలు, వడ్డీ కలుపుకొని పంటలను వారే కొనుగోలు చేసుకుని కొంత మొత్తం రైతులకు ఇచ్చి దోపిడికి పాల్పడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రభుత్వం రైతుబంధు ఇస్తున్నప్పటికి సకాలంలో రైతుబంధు డబ్బులు రాక రైతులు వడ్డీ వ్యాపారులను ఆశ్రయించక తప్పడం లేదు. ఇప్పటికైనా రెవెన్యూ, పోలీసు అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో విత్తనాలు ఎరువుల షాపులు పెట్టి అమాయక రైతులు దోచుకుంటున్న వ్యాపారుల భరతం పట్టాలని పరిశీలకులు అంటున్నారు.

నిర్మల్ జిల్లాలో ఖరీఫ్ ప్రణాళిక సిద్ధం

● పెరుగనున్న పత్తి సాగు విస్తీర్ణం
● 4,32,000 ఎకరాల సాగుకు సన్నద్ధం
● అందుబాటులో విత్తనాలు, ఎరువులు

ముథోల్, మే 23 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సాగు ప్రాముఖ్యతను జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు సిద్ధం చేశారు. గత ఏడాది కన్నా రాబోయే వర్షా కాలంలో జిల్లాలో రైతులు ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేసి రైతులను అభివృద్ధి దిశగా నడిపించాలని ఉద్దేశ్యంతో అధికారులు పక్కా ప్రణాళికలను రూపొందించారు. నిర్మల్ జిల్లాలో ఖరీఫ్ 2025 సాగు ప్రణాళికను ఖరారు చేసి రైతులను సాగుకు సన్నద్ధపరుస్తున్న విషయంపై ఆంధ్రజ్యోతి ప్రత్యేక కథకం.

జిల్లాలో సాగు పరిస్థితి..

జిల్లాలో ఖరీఫ్ కాలంలో 4,32,000 ఎకరాలలో వివిధ పంటలను సాగు చేసేందుకు వ్యవసాయ శాఖ పక్కా ప్రణాళికలు రూపొందించింది. కావాల్సిన ఎరువులు, విత్తనాలు ప్రైవేట్‌లో అందుబాటులో ఉంచినట్లు జిల్లా వ్యవసాయ అధికారి అంజి ప్రసాద్ తెలిపారు. 2025 ఖరీఫ్‌లో పత్తి 1,50,000ల ఎకరాలు, వరి 1,20,000 ఎకరాలు, సోయాబీన్ 1,00,000 ఎరాలు, మొక్కజొన్న 30,000ల ఎకరాలు, కంది 10,000ల ఎకరలు, పసుపు 9,000ల ఎక రాలు, 13 వేల ఇతర పంటలు సాగు చేసేందుకు వ్యవసాయ శాఖ ప్రణాళికలను రూపొందించింది.

ఈ యేడు కూడా పత్తిదే సింహ భాగం..

జిల్లాలో ఈ ఖరీఫ్ సాగులో కూడా ప్రతి పంటనే సింహ భాగంగా చెప్పుకోవచ్చు. గత ఖరీఫ్‌లో జిల్లాలో 1,68,000ల ఎకరాల పత్తి సాగు విస్తీర్ణం ఉంటే ఈ ఖరీఫ్ సీజన్‌లో ఒక లక్ష 50 వేల ఎకరాల వరకు పత్తి సాగుయ్యే అవకాశం ఉన్నట్టు అధికారులు తెలుపుతున్నారు. గత సంవత్సరం కంటే ఈ యేడు 18 వేల ఎకరాలు పత్తి పంట సాగు తగ్గినప్పటికీ అన్ని పంటలను పరిశీలిస్తే పత్తి సాగులో జిల్లాలో ఎక్కువగా ఉంటుందని చెప్పుకోవచ్చు. అలాగే రెండో స్థానంలో వరి పంట, మూడో స్థానంలో సోయా విస్తీర్ణం ఉంటుందని తెలుస్తుంది. అలాగే మొక్కజొన్న ఖరీఫ్‌లో గత సంవత్సరం 18 వేల ఎకరాల సాగు చేస్తే ఈ సంవత్సరం 30 వేల ఎకరాల్లో రైతులు సాగుచేసే అవకాశం ఉంది.

అందుబాటులో ఎరువులు..

జిల్లాలో 4,32,000 వివిధ రకాల పంటల సాగుకై అవసరమగు ఎరువులు, విత్తనాలు ప్రైవేట్ ద్వారా అందుబాటులో ఉన్నట్లు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్ తెలిపారు. పత్తి విత్తనాలు 3,50,000 బ్యాగులు, వరి 20,000 నుంచి 25,000ల క్వింటాళ్లు, సోయా 25,000 నుంచి 30,000 క్వింటాళ్లు, మొక్కజొన్న 12,000ల క్వింటాళ్లు, కంది 400ల క్వింటాళ్లు, ఇతర పంటల విత్తనాలు 150 క్వింటాళ్ల విత్తనాలు అన్ని ప్రైవేట్ ద్వారా అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అలాగే ఎరువులు ఖరీఫ్ సీజన్ మొత్తానికి కావాల్సిన ఎరువులు సైతం రైతులకు అందు బాటులో ఉంచినట్లు పేర్కొన్నారు. యూరియా 35,000ల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముండగా ప్రస్తుతం 8,879ల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. డీఏపీ 8,000ల మెట్రిక్ టన్నులు అవసరముండగా 1306ల మె ట్రిక్ టన్నులు ప్రస్తుతం అందుబాటులో ఉందని, అలాగే కాంప్లెక్స్ ఎరువులు 12,000ల మెట్రిక్ టన్నులు అవసరం ఉండగా 3,609ల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయని, మిగతావి సమయం ప్రకారం అందుబాటులో ఉంచుతామన్నారు.



పొలం దున్నుతున్న రైతు (ఫైల్)

రైతులు తప్పనిసరి రశీదు తీసుకోవాలి..

వర్షాకాలం సీజన్ ప్రారంభం కానున్న దృష్ట్యా రైతులు విత్తనాలు కొనుగోలు చేసే ముందు తప్పనిసరిగా సంబంధిత విత్తనాలు కొనుగోలు చేసిన దుకాణంలో రశీదు తీసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్ పేర్కొన్నారు. వ్యవసాయ శాఖ నుంచి లైసెన్స్ పొందిన డీలర్ల వద్ద విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. విత్తన ప్యాకెట్లు, బస్తాలపై పేరు, గడువు తేదీ వివరాలు తప్ప కుండా గమనించాలని, సరిగా సీల్ చేసి ఉన్న బస్తాలు, ధ్రువీకరణ పత్రం ఉన్న విత్తనాలను మాత్రమే కొనుగోలు చేయాలన్నారు. రశీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు.

భూమి దుక్కిదున్ని సిద్ధంగా ఉంచాను..

● రాథోడ్ పాండు, రైతు, విట్టోలి తండా



ఈ ఖరీఫ్‌కు ఇప్పటికే వ్యవసాయ చేనును దుక్కి దున్ని సిద్ధంగా ఉంచాను. వర్షం పడిన వెంటనే విత్తనాలను విత్తేందుకు సంసిద్ధంగా ఉన్నారు. నాకు ఉన్న పది ఎకరాల భూమిలో ఈ యేడు 3 ఎకరాల్లో పత్తి పంట, కౌలుకు తీసుకున్న పది ఎకరాల్లో, నా మిగతా భూమిలో సోయా పంట వేసేందుకు సన్నద్ధమయ్యాను. సుమారు రెండు లక్షల వరకు పెట్టుబడి అవు తుంది. ఇదివరకే వ్యవసాయ చేనును పత్తి కర్ర తీసి, వేసవి దుక్కులు వేసి సిద్ధంగా ఉంచాను.

భారీ వర్షం పడితే విత్తనాలు నాటుతా..

● జాదవ్ సంపత్, రైతు



నాకున్న ఐదున్నర ఎకరాలలో సోయా కౌలుకు తీసుకున్న రెండు ఎకరాల్లో పత్తి వేస్తాను. భారీ వర్షం కురిస్తే విత్తనాలు విత్తేందుకు సిద్ధంగా ఉన్నాను.

ధాన్యం తూకం వేయడం లేదని రోడ్డెక్కిన రైతులు

● ఖానాపూర్ - మెట్‌పల్లి రహదారిపై బైఠాయింపు ● ఆందోళనతో కదిలిన అధికార యంత్రాంగం ● కొనుగోళ్లు ప్రారంభం



ఖానాపూర్ - మెట్‌పెల్లి రహదారిపై బైఠాయించిన రైతులు



ఆందోళన చేస్తున్న రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ సుజాత

ఖానాపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం తూకం వేయకపోవడంపై రైతులు మరోసారి మండిపడ్డారు. శుక్రవారం ఖానాపూర్ మండలంలోని సుర్జాపూర్ వద్ద ఖానాపూర్ - మెట్‌పెల్లి రహదారిపై సుర్జాపూర్, మస్కాపూర్, బాదనకుర్తి గ్రామాలకు చెందిన పలువురు రైతులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు తమ ధాన్యం తడిసిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం ఖానాపూర్‌లో పర్యటించిన జిల్లా కలెక్టర్, స్థానిక ఎమ్మెల్యే తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని హామీ ఇచ్చారని అయిన ప్పటికీ సుర్జాపూర్ వరి ధాన్యం కొనుగోలు కేంద్రంలో తూకం ప్రారంభం కాలేదని మండిపడ్డారు. మరో మూడు రోజులు వర్షాలు ఉన్నాయని అధికారులే హెచ్చరిస్తున్న నేపథ్యంలో ఇంకా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం అలాగే ఉంటే మరింత తడిసిపోయి ధాన్యం మొలకలచ్చే పరిస్థితి తలె త్తుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. కొనుగోలు కేంద్రంలో తమ ధాన్యం తూకం వేయడం ప్రారంభించే వరకు తాము రాస్తారోకోను విరమించేది లేదని రైతులు భీష్మించుకుని కూర్చోవడంతో రైతులు ఆందోళన చేస్తున్న స్థలానికి తహసీల్దార్ సుజాతరెడ్డి చేరుకున్నారు. ఘటన స్థలానికి వచ్చిన తహసీల్దా ర్ వెంటనే జిల్లా అధికారులతో మాట్లాడి ధాన్యం కొనుగోళ్లను ప్రారంభించేలా చర్యలు చేపట్టారు. దీంతో రైతులు ఆందోళన విరమించారు. కాగా తమ వద్ద అదనంగా బస్తాకు ఒకటిన్నర కిలోల ధాన్యాన్ని తూకం వేస్తున్నప్పటికీ తిరిగి మిల్లుకు వెళ్లాక తరుగు పేరిట మరింత ధాన్యాన్ని కటింగ్ చేస్తున్నారని ఆరోపించారు. ధాన్యం తూకం వేసిన వెంటనే కేంద్రంలోని తమకు పూర్తి వివరాలతో కూడిన రసీదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తమకు రశీదులు ఇవ్వడం లేదని రైతులు అధికారుల తీరుపై మండిపడ్డారు. కాగా ఈ విషయమై ఐకేపీ ఏపీఎంను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా రైతు వద్ద కొనుగోలు చేసిన ధాన్యం తాలూకు పూర్తి వివరాలతో కూడిన రసీదు ఇవ్వడం తన చేతుల్లో లేదన్నారు. ధాన్యం రైస్ మిల్లుకు వెళ్లిన తర్వాతనే ట్రక్ షీట్ ప్రకారం రైతులకు పూర్తి వివరాలతో కూడిన పట్టీ (రసీదు) ఇస్తామన్నారు. మిల్లుకు వెళ్లిన ధాన్యం కట్ చేస్తే తాము తీవ్ర ఆందోళనకు దిగుతామని రైతులు హెచ్చరించారు. తమకు కొనుగోలు కేంద్రంలో ధాన్యం సేకరించిన ప్రకారమే ఖాతాలలో డబ్బులు జమ కావాలని డిమాండ్ చేశారు.

వర్షం కురిసింది.. ధాన్యం తడిసింది!



రోడ్డుపైకి వచ్చి చేరిన వర్షపు నీరు



ధాన్యంలోకి వచ్చి చేరిన వర్షపు నీరు

● ఆందోళనలో రైతులు

సారంగాపూర్, మే 23 : (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తదితర గ్రామాల్లో ఆరుగాలం శ్రమించి పండించిన వరి ధాన్యం విక్రయించే సమయంలోనే శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. వరి ధాన్యం తడిసి ముద్దయింది. దీంతో రైతులు ఆందోళనకు గురయ్యారు. వర్షం కురియడంతో ధాన్యంపై టార్పాలిన్ కవర్లు వేసినప్పటికి ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురియంతో వరి ధాన్యం వర్షపు నీరు చేరడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ఈ అకాల వర్షాలతో ధాన్యం విక్రయించే వరకు ఎన్ని ఇబ్బందులు పడాల్సి వస్తుందని రైతు లు పేర్కొంటున్నారు. ఈ అకాల వర్షానికి రైతులు ఎన్నో ఇబ్బందులు ఎదు ర్కొం టున్న పాలకులు సంబంధిత అధికారులు మాత్రం కన్నెత్తి చూడక పోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుమారు ఒక్కొక్క రైతుకు రూ. 4 లక్షల నుండి 50 వేల వరకు నష్టం జరిగిందని రైతులు పేర్కొంటున్నారు. ప్రతిరోజు అకాల వర్షం కురియడంతో తడిసిన ధాన్యంను ఇతర ప్రాంతాలకుతీసుకెళ్లి ఆర బెట్టడానికి రైతులకు ఇబ్బందులు తప్పడం లేదంటున్నాఉ. ఇప్పటికైనా పాలకు లు సంబంధిత అధికారులు రైతులను దృష్టిలో ఉంచుకొని ధాన్యంను వెంటనే కొనుగోలు చేయించి రైతులను ఆదుకోవాలని పేర్కొంటున్నారు.

జొన్నలు సైతం..

మండల కేంద్రంతో పాటు కౌట్ల, స్వర్ణ గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో అకాల వర్షం కురియడంతో కొనుగోలు కేంద్రాలకు విక్రయించడానికి తీసుకవచ్చిన జొన్నలు తడిసి ముద్దయ్యాయి. ధాన్యం కుప్పలోకి వర్షపు నీరు వచ్చి చేరడంతో ధాన్యం తడిసి ముద్దయినట్లు రైతులు పేర్కొంటున్నారు. తడిసిన ధాన్యాన్ని ఆరబెట్టడానికి ఎన్నో ఇబ్బందులకు గురవుతున్నామని ప్రభుత్వం వెంటనే జొన్నలను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని సంబంధిత అధికారులను కోరుతున్నారు.

రోడ్డుపైకి వచ్చి చేరిన వరద నీరు

శుక్రవారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి మార్కెట్ కమిటీ కార్యాలయం ముందు రోడ్డు పైకి వరద నీరు వచ్చి చేరింది. దీంతో మార్కెట్‌కు నిత్యావసర సరుకులను కొనుగోలు చేయడానికి వచ్చినటువంటి వాహనదారులు ఇబ్బందులను ఎదుర్కొన్నారు.

జొన్నల కొనుగోళ్లలో జాప్యంతో రైతుల ఆవేదన



తడిసిన ధాన్యాన్ని పల్టీ కొడుతున్న దృశ్యం

ఇచ్చోడ, మే 23 (ఆంధ్రజ్యోతి): జొన్నల కొనుగోళ్లలో నిర్వాహకులు జాప్యం చేస్తుండడంతో రైతులు ఆవేదనను వ్యక్తపరుస్తున్నారు. ఇచ్చోడ మండలం అడేగామ(కె) గ్రామానికి చెందిన రైతులు శుక్రవారం ఆందోళన బాట చేపట్టారు. గురువారం రాత్రి కురిసిన వర్షానికి కొనుగోలు కేంద్రంలో ఉన్న వందలాది కుప్పలు తడిసిపోయాయి. గత పది రోజులుగా ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఉన్నప్పటికీ బార్దన్లు ఇచ్చి కాటా అయిన ధాన్యాన్ని కొనుగోలు చేయక పోవడంతో రైతులు ఆందోళనకు దిగారు. రెండు, మూడు రోజుల్లో వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు ఎలా చేస్తున్నారని ప్రశ్నించడంతో అధికారులు జవాబు ఇవ్వలేకపోయారు. దళారులు తీసుకు వస్తున్న ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారన్నారు. దళారుల ధాన్యం కొనుగోలుకు బస్తాకు కొంత సొమ్ము చొప్పున ముట్టజెప్తున్నారని వారి ధాన్యం కొనుగోలు మార్కెట్‌లో నిలిచిపోవట్లేదని రైతులు వారి ఆవేదనను వెల్లబుచ్చు కున్నారు.

రైతన్నను కలవరపెడుతున్న వర్షం

ముథోల్, మే 23 (ఆంధ్రజ్యోతి) : మూడు రోజుల నుంచి కురుస్తున్న వర్షం కారణంగా రైతన్న కలవర పడుతున్నాడు. కల్లాల్లో ఉన్న వరి ధాన్యం తడవకుండా ఉండేందుకు అవస్థలు పడుతున్నారు. ఉదయం వేళలో తడిసిన ధాన్యం ఆరబెట్టడం, సాయంత్రం వేళలో కురుస్తున్న వర్షం కారణంగా ధాన్యాన్ని టార్పాలిన్‌లతో కప్పడంతో రైతన్నలు ఆందోళనకు గురవుతున్నారు. చేతికొచ్చిన పంటను కల్లాల్లో, వరి కొనుగోలు కేంద్రాల్లో ఎండబెట్టడంతో కురిసిన వర్షం కారణంగా అవి తడిసి పోయాయి. కొన్నింటికి మొలకలు సైతం వచ్చాయి. తడవకుండా రైతులు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఏదో ఒక పక్కన వరి ధాన్యం తడిసిపోతుందని ఆందోళన చెందుతున్నారు. రైతులు అధైర్య పడవద్దని, తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అధికారులు సైతం చెబుతున్నారు. అయితే ఏదేమైన ప్పటికీ మూడు రోజులుగా కురుస్తున్న ఈ వర్షం రైతన్నలకు ఇబ్బంది పాలు చేస్తుందని చెప్పుకోవచ్చు. మొన్నటి వరకు ఎండ వేడిమితో ఉక్కిరి బిక్కిరైన జనం ఈ వర్షం కా రణంగా వాతావరణం కొద్దిమట్టుకు చల్లబడినప్పటికీ రైతన్నలకు మాత్రం ఈ వర్షం కలవరపెడుతుంది.



ధాన్యాన్ని ఆరబెడుతున్న రైతులు



మొలక వచ్చిన వరి ధాన్యం







ఫొటో న్యూస్

అపరిశుభ్రంగా రైతు బజార్

రైతులు తమ పంట ఉత్పత్తులు విక్రయించేందుకు ప్రభుత్వం రైతు బజార్లను ఏర్పాటు చేసింది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రాల్లోను ప్రత్యేకంగా గదులు నిర్మించింది. కాని వాటిని వినియోగించక పోవడం, పరిసరాలు చెత్తా చెదారంగా మారడంతో అపరిశుభ్ర వాతావరణాన్ని తలపిస్తుంది. రానున్న వర్షాకాలంలో ఇలాంటి పరిస్థితి ఉంటే దుర్గంధం వెదజల్లి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుంది. అధికారులు దృష్టి సారించి పారిశుధ్య చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.


● (ఆంధ్రజ్యోతి, ఆదిలాబాద్ స్టాఫ్‌ఫొటోగ్రాఫర్)

రైతుబజార్‌లో చెత్తా చెదారంతో కనిపిస్తున్న పరిసర ప్రాంతాలు













● కోర్టా-చనకా బ్యారేజీ

- జిల్లాలో కోర్టా-చనకా బ్యారేజీపై దృష్టి సారించని రాష్ట్ర ప్రభుత్వం
- వెట్‌రన్‌కే పరిమితమైన హత్తిఘాట్ పంప్‌హౌజ్ పనులు
- ఈసారి ఆయకట్టుకు సాగునీరు అందడం గగనమే
- అసంపూర్తిగా కనిపిస్తున్న కాలువల నిర్మాణ పనులు
- ఏళ్ల తరబడి ఆయకట్టు రైతులకు తప్పని ఎదురుచూపులు

కనిపించని కదలిక!



ఆదిలాబాద్, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో గత ప్రభుత్వ హయాంలో పెన్‌గంగా నదిపై చేపట్టిన కోర్టా-చనకా బ్యారేజీ నిర్మాణ పనులు ఇంకా అసంపూర్తిగానే కనిపిస్తున్నాయి. తొమ్మిదేళ్ల క్రితం పనులను ప్రారంభించినా.. ఆయకట్టుకు సాగునీటిని అందించిన దాఖలాలు లేవు. కాంగ్రెస్ ప్రభుత్వంపై జిల్లా రైతులు భారీ ఆశలు పెట్టుకున్నారు. అయితే పెండింగ్ పనులను పూర్తి చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు రూపొందించడం లేదన్న వాదనలు వినిపిస్తున్నాయి. కనీసం కదలిక కనిపించకపోవడంతో అన్నదాతలు ఆశలు వదిలేసుకుంటున్నారు. 2016లో రూ.386 కోట్ల అంచనా వ్యయంతో కోర్టా-చనాకా బ్యారేజీ నిర్మాణ పనులకు గత ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఆ తర్వాత అంచనా వ్యయాన్ని భారీగా పెంచింది. అలాగే ఇప్పటికే పది సార్లు పనుల గడువు సమయాన్ని పొగడించినా ప్రయోజనం లేకుండా పోయింది. గత మూడేళ్ల క్రితమే బ్యారేజీనిర్మాణం, హత్తిఘాట్ పంప్ హౌస్ పనులు దాదాపుగా పూర్తయినా ఆయకట్టు రైతులు సాగు నీటికి నోచుకోవడం లేదు. మరో పది రోజుల్లోనే వర్షాకాల సీజన్ ప్రారంభంకానుంది. ఈసారి కూడా వానాకాలం పంటల సాగుకు సాగునీరు అందడం అనుమానంగానే కనిపిస్తుంది. 2023 అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావుడిగా హత్తిఘాట్ పంపు హౌస్ వెట్‌రన్‌ను విజయవంతంగా నిర్వహించినా.. ఇప్పటి వరకు చుక్క నీటిని ఎత్తిపోసిన దాఖలాలు లేవు. నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం తీవ్ర జాప్యం చేస్తూ వస్తుంది. ఇప్పట్లో ప్రాజెక్టు పనులు పూర్తికావడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అంతేకాకుండా ఏళ్ల తరబడి ఎదురుచూసే ఓపిక లేక ఆయకట్టు రైతులు ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా పంటలకు సాగునీటిని అందిస్తున్నారు.



● హత్తిఘాట్ పంప్‌హౌజ్

ఎన్నికల కోసమే హడావుడి

గడిచిన అసెంబ్లీ ఎన్నికలకు ముందు హడావుడి చేసిన అధికారులు హత్తిఘాట్ పంప్‌హౌజ్ డ్రైరన్‌తో పాటు వెట్‌రన్‌ను పూర్తి చేశారు. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. కానీ రెండేళ్లు గడిచిపోతున్నా.. ఇప్పటి వరకు అర ఎకరం ఆయకట్టుకు సాగునీరు అందడం లేదు. పూర్తయిన కాలువల నిర్మాణ పనులు అధ్వానంగా మారి కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల సిమెంట్ పనులు పగుళ్లు తేలి ధ్వంసం

(తరువాయి 6వ పేజీలో...)

ప్రభుత్వ ఆదేశాలతో పనులను ప్రారంభిస్తాం

: కె.రవీందర్, ఈఈ, పెన్‌గంగ ప్రాజెక్ట్

కోర్టా-చనకా బ్యారేజీ, హత్తిఘాట్ పంప్‌హౌజ్ పనులు దాదాపుగా పూర్తయ్యాయి. కాలువల నిర్మాణ పనులను చేపట్టాల్సి ఉంది. ప్రభుత్వం నిధులను మంజూరు చేస్తే పనులను ప్రారంభిస్తాం. హత్తిఘాట్ పంప్ హౌస్ పనులు పూర్తికావడంతో కొంత వరకు ఆయకట్టుకు సాగునీటిని అందించే అవకాశం ఉంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం చర్యలు చేపడుతాం. ప్రధానంగా కాలువల నిర్మాణానికి భూసేకరణ చేయాల్సి ఉంది. కోర్టా చనకా బ్యారేజి పెండింగ్ పనులకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి అందించాం. ప్రభుత్వమే నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది.

ఏజెన్సీ చట్టాలను దుర్వినియోగం చేసే వారిపై చర్యలు : ఎస్పీ

ఇంద్రవెల్లి, మే 23(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీ చట్టాలను దుర్వినియోగం చేసే వారిపై చర్యలు తప్పవని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఒక ప్రకటనలో తెలిపారు. ఏజెన్సీ చట్టాలలో ఉన్న లొసుగులను ఆసరాగా తీసుకొని నాన్ ట్రైబ్స్‌పై కేసులు వేస్తూ వారి వద్ద బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి రిమాండ్‌కు చేసినట్లు తెలిపారు. ఇంద్రవెల్లి మండలం నాన్ ట్రైబ్స్‌పై కావాలనే కేసులు నమోదు చేస్తూ బెదిరింపులకు, బ్లాక్ మెలింగ్ పాల్పడుతున్న ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఉట్నూర్ ఐటిడిఏ పరిధిలో నివసిస్తున్న నాన్ ట్రైబ్స్ సాధారణంగా బాండ్‌పై క్రయవిక్రయాలను నిర్వహిస్తూ ఉంటారని, ఇది చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. చట్టంలో ఉన్న లొసుగులను వాడుకొని ఇంద్రవెల్లి మండల కేంద్రంలో నివసిస్తూ.. ఇళ్లను, వాణిజ్య సముదాయాలను నిర్మించుకుంటున్న నాన్ ట్రైబ్స్‌పై ఐటిడిఏ ద్వారా నోటీసులను పంపించి, వారి వద్ద నుంచి అక్రమంగా డబ్బులను వసూలు చేస్తున్న ఇద్దరిపై ఇంద్రవెల్లిలో కేసు నమోదు అయ్యిందని తెలిపారు. ఇంద్రవెల్లి మండల కేంద్రంలోని ఆడావ్ చంపత్ రావు ఫిర్యాదు మేరకు 2023లో ఐటీడీఏ నందు మెస్రం ఆనందరావు, గవందే బిపిన్ కుమార్, విపిన్‌లు ఐటిడిఏ ఏజెన్సీ ఏరియా నందు ఆడావ్ చంపత్ రావు నిర్మించిన వాణిజ్య నిర్మాణాన్నిపై ఐటిడిఏ కోర్టు నందు ఫిర్యాదు నమోదు చేశారని తెలిపారు. కాగా, వీరు ఇరువురు నిందితులు ఆడావ్ చంపత్ రావును కలిసి ఫిర్యాదును వెనక్కి తీసుకుంటామని వారి వద్ద నుంచి రూ.2 లక్షల వసూలు చేశారని తెలిపారు. అంతేకాకుండా ఇంద్రవెల్లి పబ్లిక్ స్కూల్ యజమాని వద్ద అదేయేడు రూ.2 లక్షలు వసూలు చేశారని దర్యాప్తులో తేలిందని తెలిపారు. నిందితులు ఏజెన్సీ ప్రాంతంలో నివసిస్తున్న నాన్ ట్రైబ్స్ అందరూ కలిసి రూ.20 లక్షలు తనకు ఇవ్వాలని, లేదంటే ఐటీడీఏలో కేసులు నమోదు చేస్తానని బెదిరింపులకు పాల్పడడం జరిగిందని తెలిపారు. అయితే ఫిర్యాదుల కోసం 'మెసేజ్ యువర్ ఎస్పీ మొబైల్ నెం. 8712659973 ద్వారా సమాచారం అందించవచ్చని, వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని పేర్కొన్నారు.

షరతులు లేకుండా తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలి

● బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్

ఉట్నూర్, మే 23(ఆంధ్రజ్యోతి): అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని బీజేపీ నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండల కేంద్రంలోని రితేష్ నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దళారుల ప్రమేయం లేకుండా రైతుల పంటలు కొనుగోలు చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. దళారుల ప్రమేయం లేకుండా రైతుల ధాన్యాన్ని కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లించాలన్నారు. లేనట్లయితే బీజేపీ ఆధ్వర్యంలో నిర్మల్ జిల్లా వ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో బింగి వెంకటేష్, కొండేరి రమేష్, రాథోడ్ శేషరావు, సీపతి లింగగౌడ్, సాడిగే రాజేశ్వర్, రాథోడ్ విఠల్, పవార్ దేవిదాస్, బొడ్డు కిరణ్, సాల్గరే రమేందర్, ఉపేందర్, జాదవ్ రవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నిర్మల్ జిల్లా అధ్యక్షుడు రితేష్ రాథోడ్



విత్తన షాపులో తనిఖీ నిర్వహిస్తున్న జిల్లా కలెక్టర్



వీధి వ్యాపారులకు కల్పించిన తాత్కాలిక స్థలాన్ని పరిశీలిస్తూ..

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● జిల్లా కలెక్టర్ రాజర్షి షా హెచ్చరిక ● జిల్లాకేంద్రంలోని పంజాబ్ చౌక్‌లో గల పలు విత్తన షాపులలో ఆకస్మిక తనిఖీలు

ఆదిలాబాద్ టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ రాజర్షి షా హెచ్చరించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని పంజాబ్ చౌక్‌లో గల నిఖిల్ ఫర్టిలైజర్, రైతు మిత్ర ట్రేడర్స్ విత్తన షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తన ప్యాకెట్లను పరిశీలించి, స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. స్టాక్ వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలని ఆదేశించారు. జిల్లాలో వివిధ కంపెనీల గల పత్తి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని.. రైతులు ఆందోళన చెందవలసిన అవసరం లేదని కలెక్టర్ రాజర్షి షా స్పష్టం చేశారు. రైతులు ఎవరు అధైర్య పడొద్దని విత్తనాలను పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచమన్నారు. విత్తనాలు తీసుకున్న తర్వాత రైతులు రసీదులను పంట కాలం పూర్తయ్యే వరకు భద్రపరచాలన్నారు.

● వీధి వ్యాపారుల సమస్యల పరిష్కారానికి కృషి

ఆదిలాబాద్ టౌన్: వీధి వ్యాపారుల సమస్యలను పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. ఇటీవల తాత్కాలికంగా ఆదిలాబాద్ గణేష్ టాకీస్ ప్రాంతంలో వీధి వ్యాపారులకు కల్పించిన తాత్కాలిక స్థలాన్ని ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా వీధి వ్యాపారుల సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. స్థానికంగా మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తామని పేర్కొన్నారు.

● ఉచిత శిక్షణలు అభినందనీయం

ఆదిలాబాద్ టౌన్: ప్రభుత్వ విద్యా సంస్థల్లో చదివే విద్యార్థులు పోటీ పరీక్షల్లో రాణించేలా శిక్షణలు అందించడం అభినందనీయమని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అన్నారు. 21 సెంచరీ ఐఏఎస్ అకాడమీ ఆధ్వర్యంలో 8 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు ఉచిత నైపుణ్య శిక్షణ తరగతులను జిల్లా రణదీవేనగర్ ప్రభుత్వ పాఠశాలలో కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. అనంతరం పోటీ పరీక్షలకు సంబంధించిన బుక్ లెట్‌ను ఆవిష్కరించారు.



లక్కారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొజ్జు పటేల్



క్షయ ముక్తి భారత్ పోస్టర్లను ఆవిష్కరిస్తూ..

సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం

● ఖానాపూర్‌లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్

ఉట్నూర్, మే 23(ఆంధ్రజ్యోతి): విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, ప్రాథమిక దశలో నాణ్యమైన విద్య అందినప్పుడే విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదుగుతారని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని లక్కారంలో సమగ్రశిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 5 రోజుల ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుల సామర్థ్యం నిర్మాణం శిక్షణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమైందని అన్నారు. విద్యార్థులకు ప్రాథమిక దశలో నాణ్యమైన విద్య అందించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా వ్యవస్థను బలోపేతం చేయడం కోసం నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ఏజెన్సీ ప్రాంతంలోని మారుమూల గ్రామీణ ప్రాంతాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రణాళిక బద్ధంగా ఉపాధ్యాయులు విద్యను బోధించాలన్నారు. ఏ సమస్యలు ఉన్న తమ దృష్టికి తీసుకు రావాలని అన్నారు. సమస్యల పరిష్కారం కృషి చేస్తామని తెలిపారు. అనంతరం ఇటీవల వెలువడిన సివిల్ ఫలితల్లో 76వ ర్యాంకు సాధించి సత్తా చాటిన సాయిచైతన్య తల్లి ఉపాధ్యాయురాలు కవితను సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి ఆశన్న, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

● టీబీ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేద్దాం

ఉట్నూర్: ప్రతీఒక్కరు క్షయవ్యాధి నివారణకు కృషి చేయాలని, ఈ వ్యాధిని అరికట్టాలంటే వ్యాధి సోకిన వారు తగిన జాగ్రత్తలు పాటించాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో వైద్యశాఖ సిబ్బందితో కలిసి టీబీ ముక్తి భారత్‌కు సంబంధించిన గోడప్రతులను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ టీబీ వ్యాధి ఓ అంటు వ్యాధి అని, ప్రతి ఒక్కరు జాగ్రత్తలు పాటిస్తేనే ఈ వ్యాధిని అరికట్టవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా టీబీ కంట్రోల్ అధికారి డా.సుమలత, జిల్లా టీబీ కోఆర్డినేటర్ జాదవ్ సుదర్శన్, టీబీ సూపర్‌వైజర్ వెంకటేశ్వర్, అంబారావు, ల్యాబ్ టెక్నీషియన్ వేణు, తదితరులు పాల్గొన్నారు.



పీవోకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూసీ నాయకులు

ఉమ్మడి జిల్లాలోని ఏఎన్‌ఎంలకు బీమా సౌకర్యం కల్పించాలి : సీఐటీయూ

ఉట్నూర్, మే23 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలోని ఆశ్రమ వసతి గృహాలు, పాఠశాలల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలందరికీ బీమా సౌకర్యం కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఐటీడీఏ కార్యాలయంలో ప్రాజెక్టు అధికారి ఖుష్బుగుప్తాను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించారు. బోథ్ పోస్టు మెట్రిక్ వసతి గృహంలో ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో మృతి చెందిన ఏఎన్ఎం గిరిజ కుటుంబానికి న్యాయం చేయాలని, వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కల్పించాలని కోరారు. అనంతరం కిరణ్ మాట్లాడుతూ గిరిజన సంక్షేమ శాఖలోని ఆశ్రమ పాఠశాలలో వసతి గృహాల్లో పని చేస్తున్న ఏఎన్ఎంలు 24 గంటల పాటు విద్యార్థులకు అందుబాటులో ఉంటూ కంటికి రెప్పలా కాపాడుతున్నారని, నిత్యం వైద్య ఆరోగ్య సేవలు అందిస్తున్నారని అన్నారు. కానీ ఏఎన్ఎంలకు ఎటువంటి ఉద్యోగ భద్రత, ఇతర సౌకర్యాలు ఏవీ కల్పించడం లేదన్నారు. ఉద్యోగ భద్రత, బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, ఏఎన్ఎంలు కామేశ్వరి, జంగుబాయి, నర్మద, అశ్విని, రంభ, చిత్రకళ, తదితరులు పాల్గొన్నారు.



జొన్న పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే పాయల శంకర్

జొన్న కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలి : ఆదిలాబాద్ ఎమ్మెల్యే

జైనథ్, మే 23(ఆంధ్రజ్యోతి): జైనథ్ ఉమ్మడి మండలంలోని మేడిగూడ, జైనథ్, పిప్పర్‌వాడలో జరుగుతున్న జోన్న పంట కొనుగోళ్లను త్వరగా పూర్తి చేయాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన జైనథ్, మార్కెట్‌యార్డులో పంటను అమ్మడానికి వచ్చిన జోన్న రైతులు ఐదు ఆరు రోజులు వేచి చూడడం బాధాకరమన్నారు. అకాల వర్షంతో జొన్న పంట తడుస్తు ఉన్నందున కేంద్రాలలో రాత్రింభవళ్లు కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ విషయంపై హైదరాబాద్ కమిషనర్‌తో మాట్లాడి రైతులకు భరోసా కల్పించారు. కాగా, పాయల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పాయల శంకర్ భోజనాన్ని వడ్డించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు రత్నాకర్‌రెడ్డి, బీజేపీ పార్టీ జైనథ్ మండల పార్టీ అధ్యక్షుడు లోక కరుణాకర్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు ఎస్.ప్రతాప్ యాదవ్, బీజేపీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు అస్తక్ సుభాష్, జైనథ్ మాజీ ఉప సర్పంచ్ టి.రాకేష్ రెడ్డిలతో ఆయా గ్రామాల జొన్న రైతులు పాల్గొన్నారు.



పోటీలను ప్రారంభిస్తున్న డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు

అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ప్రారంభం

ఆదిలాబాద్ టౌన్, మే 23(ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లాకేంద్రంలోని ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో జిల్లాస్థాయి సబ్ జూనియర్ అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ప్రారంభమయ్యాయి. డీవైఎస్‌వో వెంకటేశ్వర్లు పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులు రాష్ట్ర స్థాయిలో సత్తా చాటి జిల్లాకు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం 100 మీటర్ల పరుగును జెండా ఊపి లాంఛనంగా ప్రారంభించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రాజేష్ మాట్లాడుతూ అండర్ 8, 10, 12 వయసు విభాగంలో బాల, బాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి ఎంపికైన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ కార్యదర్శి కాంతారావు, పేటా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పార్థసారథి, సాయికుమార్, రాకేష్, సౌమ్య, జ్యోతీశ్వరన్, తదితరులు పాల్గొన్నారు.

'గంజాయి పండించినా.. అమ్మినా.. ప్రభుత్వ పథకాలు బంద్'

భీంపూర్, మే 23 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గంజాయి పండించిన అమ్మినా అలాంటి వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు రాకుండా చర్యలు తీసుకుంటామని ఎస్పీ అఖిల్ మహాజన్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం భీంపూర్ మండలం తాంసి(కె) గ్రామానికి చెందిన కంటి అశోక్, ఓంకార్ అనే రైతులు వ్యవసాయ భూమిలో గంజాయి సాగు చేస్తున్నారన్న సమాచారం మేరకు భీంపూర్ ఎస్ఐ పీర్‌సింగ్ నాయక్ తన సిబ్బందితో వెళ్లి 30 గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుని ఇద్దరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని పేర్కొన్నారు. ఇప్పటి వరకు జిల్లాలో 50 గంజాయి కేసులు నమోదు కాగా 107 మందిపై కేసులు నమోదు చేయగా.. అందులో నుంచి 90 మందిని అరెస్టు అయ్యారని తెలిపారు. గంజాయిని అరికట్టేందుక ప్రత్యేకంగా కళాశాలల్లో పోలీసులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులతో యాంటి డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేసి పర్యవేక్షణ చేయడం జరుగుతుందన్నారు. అదేవిధంగా గంజాయి పండించడం, సాగు చేయటం, అమ్మడం లాంటివి చేస్తే అలాంటి వారిపై కఠినంగా చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో గంజాయి సేవించిన వారిని పట్టుకునేందుకు ప్రత్యేకంగా గంజాయికి కిట్లను ఉపయోగిస్తామని గంజాయి సాగు చేసినా.. పండించిన వారికి సంక్షేమ పథకాలు అందకుండా చర్యలు తీసుకుంటూ జిల్లా కలెక్టర్‌కు నివేదిక సమర్పిస్తామని తెలిపారు. మెసెజ్ యువర్ ఎస్పీ కార్యక్రమంలో అందించబడిన వాట్సాప్ నెం. 8712659973 ద్వారా సమాచారం అందించవచ్చని సూచించారు.



గంజాయి మొక్కలను స్వాధీనం చేసుకుంటున్న ఎస్సై పీర్‌సింగ్ నాయక్